# ప్రకృతి పూల పండుగ

-తొమ్మిది రోజుల పాటు ఆడపడుచుల ఆటపాట

-సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ

-శుభాకాంక్షలు తెలిపిన మంత్రి హరీష్‌రావు

6 లో







# మనం

## మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

శనివారం | 14 | అక్టోబర్ | 2023 | పేజీలు : 8


# అధినేత వస్తున్నారహో



- రేపు హుస్నాబాద్‌లో కేసీఆర్ బహిరంగ సభ
- మూడోసారీ హుస్నాబాద్ నుంచే శ్రీకారం
- 100 సీట్లు పై గురిపెట్టిన బీఆర్ఎస్
- జనసమీకరణకు ఏర్పాట్లు
- గులాబీమయంగా మారనున్న హుస్నాబాద్
- మా అదృష్టం : ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



హుస్నాబాద్,అక్టోబర్ 13,(మనం న్యూస్): అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించి తమకు ఏ పార్టీ సాటిలేదని నిరూపించిన బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్, అదే ఊపుతో ఎన్నికల సమరాంగణంలోకి అడుగు పెట్టబోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇప్పటికే విపక్షాల కు అందనంత దూరం దూసుకుపోయిన బీఆర్ఎస్, ఇక అసలు సిసలైన పోరాటం మొదలుపెట్టనున్నది. ప్రత్యర్థులను చిత్తుచేసేలా రణ గర్జన వినిపించబోతున్నది. అభివృద్ధే అస్త్రాలుగా సీఎం కేసీఆర్ ఎన్నికల సమరాంగణంలోకి అడుగుపెట్టనున్నారు. కేసీఆర్ రేపు హుస్నాబాద్‌లో ప్రచార శంఖారావాన్ని పూరించనున్నారు. స్వరాష్ట్రంలో జరిగిన రెండు 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కలిసొచ్చిన హుస్నాబాద్ నుంచే ఈ సారి కూడా బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ సమరశంఖం పూరించనున్నారు. తెలంగాణ అసెంబ్లీకి తొలిసారిగా 2014 లో జరిగిన ఎన్నికల ప్రచారాన్ని కేసీఆర్ హుస్నాబాద్ నుంచే ప్రారంభించారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ 63 స్థానాల్లో విజయం సాధించడంతో పాటు కేసీఆర్ ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు స్వీకరించారు. ఆ తరువాత 2018 సెప్టెంబర్ 6 న అసెంబ్లీ రద్దు చేసిన మరుసటి రోజే (సెప్టెంబర్ 7) హుస్నాబాద్

మిగతా 2లో..

## కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

-పోలీస్ బందోబస్తుకు ప్రణాళిక సిద్ధం చేయాలి

-జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

2 లో



# మెదక్ ఆత్మగౌరవాన్ని డబ్బుతో కొనలేరు

- మంత్రి హరీష్‌రావు
- బిఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన హరీష్‌రావు
- పద్మారెడ్డి హ్యాట్రిక్ కోసం పని చేస్తా
- మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి



పాపన్నపేట, అక్టోబర్ 13, మనం న్యూస్: మెదక్ ప్రజల ఆత్మగౌరవాన్ని డబ్బుతో కొనలేరని మంత్రి హరీష్‌రావు అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశి. దర్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. శశిధర్‌రెడ్డితోపాటు వివిధ మండలాల నుండి సుమారు 40 మంది కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ మెదక్ ప్రజలు ఆత్మగౌరవాన్ని డబ్బులతో కొనలేరని, డబ్బొక్కటే పరధానం కాదని ఆత్మగౌరవం అన్నిటికంటే ముఖ్యమైందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలవాలంటే ప్రజల ప్రేమ ఉండాలని, ప్రజలకు సేవ చేయాలన్నారు. ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా మెదక్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, మెదక్ ప్రత్యేక జిల్లా అయిందంటే దానికి పద్మారెడ్డి కృషి, సీఎం కేసీఆర్ ఆశీర్వాదం ఉందన్నారు. కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం

మిగతా 2లో..

# అధినేత వస్తున్నారహో



మొదటి పేజీ తరువాయి..

నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల శంఖారావం పూరించారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ 88 స్థానాలతో జైత్రయాత్ర కొనసాగించి, వరుసుగా రెండోసారి అధికారంలోకి వచ్చింది. వందకు పైగా సీట్లతో హ్యాట్రిక్ విజయం పై గురి పెట్టిన సీఎం కేసీఆర్ ఈ సారి కూడా హుస్నాబాద్ నుంచే సమరశంఖం పూరిస్తుండటం విశేషం. రేపు మధ్యాహ్నం 3 గంటలకు హుస్నాబాద్ నుంచే సమరశంఖం పూరించనున్న నేపథ్యంలో మరోసారి ఈ నియోజకవర్గం ప్రత్యేక పాధాన్యత సంతరించుకున్నది.

## సతీశ్‌కు సాటి లేరు...

గడిచి పదేళ్లలో హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించడంలో ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ సక్సెస్ అయ్యారు. కల్లోల ప్రాంతంగా ఉన్న హుస్నాబాద్‌లో ఆయన ప్రశాంతత నింపారు. కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చారు. విద్య, వైద్యం, విద్యుత్‌తో పాటు మౌళిక సదుపాయాల కల్పనలో హుస్నాబాద్ అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. హుస్నాబాద్ సతీశ్‌కు మార్ హయంలో మంచి గుర్తింపు వచ్చింది. హుస్నాబాద్‌ను రెవెన్యూ డివిజన్ గా తీర్చిదిద్దారు. కొత్త గ్రామపంచాయతీలు, కొత్త సబ్‌స్టేషన్లు, కొత్త రోడ్లు ఒక్కటేమిటి అన్ని రంగాల్లోనూ హుస్నాబాద్ అభివృద్ధి చేశారనేది అందరూ ఒప్పుకునే అంశం. గతంలో హుస్నాబాద్‌కు ఇప్పటి హుస్నాబాద్‌కు పోల్చి చూసినపుడు కనిపిస్తున్న మార్పును విమర్శలకు కూడా ఒప్పుకోవడం గమనార్హం.

## సతీశ్ వ్యక్తిత్వం..అదనపు బలం.....

ప్రజల దృష్టిలో మంచి ఎమ్మెల్యేగా, ప్రజాప్రతినిధిగా ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తిగా వొడితల సతీశ్‌కుమార్ పేరు తెచ్చుకున్నారు. ఇటు నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో మంచి సంబంధాలు కొనసాగిస్తూనే మరోవైపు నిరంతరం ప్రజల్లో మమేకమై పని చేసారు. తన వద్దకు వచ్చేవారికి ఎవరికీ కాదనకుండా సహాయం చేసారని అందరూ అంటారు. శత్రువులకు కూడా ఆయన ఉపకారం చేస్తారే తప్ప ఎలాంటి అపకారం చేయరనే పేరుంది. శత్రువులు కూడా సతీశ్‌కుమార్‌ను ప్రశంసిస్తారంటే అతిశయోక్తి కాదు. ఇటీవల మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చీమకు కూడా హాని చేయని నేతగా సతీశ్‌కుమార్‌ను అభివర్ణించారు. ఎమ్మెల్యే అంటే సతీశ్‌బాబులా ఉండాలి అంటూ కితాబిచ్చారు.

## గులాబీ జోరు..ప్రతిపక్షాల బేజారు.........

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ నాయకత్వంలో ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ దూసుకుపోతుంది. కానీ కాంగ్రెస్, బీజేపీల నుండి ఎవరు అభ్యర్థులుగా పోటీ చేస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రచారం ఊపందకుంది. ముగ్గురు మంత్రులు నియోజకవర్గంలో ప్రచార సభలు నిర్వహించారు. రేపు సీఎం కేసీఆర్ బహిరంగ సభ జరగనుండగా ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుండి గ్రామ గ్రామాన ఎన్నికల ప్రచారం మరింత ఉధృతం చేసేందుకు ఆ పార్టీ సన్నాహాలు చేస్తోంది. సీఎం కేసీఆర్ సభతో గులాబీ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తోందన్న సంకేతాలు ఇటు ప్రత్యర్థులకు అటు ప్రజలకు ఇచ్చేందుకు సన్నద్ధమవుతోంది.

## నేడు మంత్రి హరీశ్‌రావు రాక......




సీఎం కేసీఆర్ పర్యటన రేపు హుస్నాబాద్‌లో ఉండటంతో ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వస్తున్నారు. మూడు రోజుల క్రితం హుస్నాబాద్ వచ్చిన మంత్రి హరీశ్‌రావు సభాస్థలిని సందర్శించి కార్యకర్తలు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేసిన విషయం అందరికీ తెలిసిందే. సీఎం కేసీఆర్ ఎన్నికల పర్యటన నేపథ్యంలో అటు అధికార యంత్రాంగం, మరో వైపు పార్టీ శ్రేణులు అప్రమత్తమవుతున్నారు. రాజకీయ వర్గాల్లో సీఎం పర్యటన ఉత్కంఠను రేపుతోంది.

## మా అదృష్టం...ఎమ్మెల్యే సతీశ్ కుమార్

బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మూడోసారి హుస్నాబాద్ నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించడం తమకు గొప్ప అవకాశమని, కెప్టెన్ లక్ష్మీకాంతరావు కుమారుడు, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యమాల పోరుగడ్డ హుస్నాబాద్ చారిత్రక వారసత్వంలో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించబోయే అపూర్వ సన్నివేశానికి తమ నియోజకవర్గం వేదిక కావడం తమకు దక్కిన గొప్ప వరం అని ఆయన తెలిపారు. కేసీఆర్ సభకు సుమారు లక్ష మంది వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయని కేసీఆర్ ఆదివారం సాయంత్రం 4 గంటలకు వస్తారని మధ్యాహ్నం రెండు గంటల వరకే సభాస్థలికి కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని రకాల తెలంగాణ సంస్కృతి కార్యక్రమాలను నిర్వహించి కేసీఆర్ సభను జాతర లాగా నిర్వహించబోతున్నట్లు ఆయన స్పష్టం చేసారు.

# మెదక్ ఆత్మగౌరవాన్ని డబ్బుతో కొనలేరు

మొదటి పేజీ తరువాయి..



పూర్తి చేసుకున్నామని, మెడికల్ కళాశాల తెచ్చుకున్నామని, మెదక్‌కు రైలు తెచ్చుకున్నామన్నారు. పాపన్నపేట మంజీర తీర ప్రాంత రైతులకు సింగూరు నీళ్ల కోసం హైదరాబాద్ వచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏ రోజు నీళ్ల కోసం హైదరాబాద్ రాలేదని, సీఎం కేసీఆర్ సింగూర్ జలాశయాలను మెదక్‌కే పరిమితం చేయడం వల్ల సంవత్సరానికి రెండు పంటలు పుష్కలంగా పండుతున్నాయన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక గణపురం వనదుర్గా ప్రాజెక్టు ఆధునికీకరణ జరిగిందని, కాలువల లైనింగ్ పూర్తి చేశామని, ప్రాజెక్టు ఎత్తు పెంపు ప్రక్రియ జరుగుతుందన్నారు. వ్యవసాయమే దండగ అన్న రోజులు పోయి వ్యవసాయం అంటే పండగ అన్న రోజులు వచ్చాయన్నారు. తెలంగాణలో ప్రవేశపెట్టన కంటి వెలుగు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలన్నీ పొరుగు రాష్ట్రాలు, కేంద్రం అనుసరిస్తున్నాయంటే ఆలోచన చేసుకోవాలన్నారు. అంతకుముందు బిఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెష్ పార్టీని మనస్ఫూర్తిగా వీడి బిఆర్ఎస్‌లో చేరుతున్నా నన్నారు. తమ కుటుంబం మొత్తం కాంగ్రెస్ పార్టీకి మెదక్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసిందని గుర్తు చేశారు. అనేకసార్లు ఎమ్మెల్యే టికెట్ విషయంలో కాంగ్రెస్ పార్టీ తనను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెవులు ఉన్నాయి కానీ కళ్లు లేవని విమర్శించారు. క్షేత్ర స్థాయిలో నాయకులు ఏ విధంగా పని చేస్తున్నారనేది చూడకుండా గాంధీభవన్ నుండే చెప్పిన మాటలు విని టికెట్లు ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు సోములు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడుపాయల చైర్మన్ బాలా గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

సిద్దిపేట, అక్టోబర్ 13, మనం న్యూస్ ప్రతినిధిః సాధారణ ఎన్నికల్లో పోలైన ఓట్లను లెక్కించేందుకు గాను కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన గదులను సిద్ధం చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. శాసనసభ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల పరిధిలోని ఇందూర్ కళాశాలను పోలీస్ కమీషనర్ శ్వేతతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గానికి స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు డి బ్లాక్, హుస్నాబాద్ నియోజకవర్గానికి స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు సి బ్లాక్, గజ్వేల్ నియోజకవర్గానికి స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు ఇ బ్లాక్, దుబ్బాక నియోజకవర్గానికి స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు ఏ బ్లాక్‌లను పరిశీలించి ప్రక్రియకు అనుగుణంగా ఆయా బ్లాక్‌లలో గదులను సిద్ధం చేయాలని మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్, బ్లాక్‌ల వారీగా ఏర్పాటు చేయాలని , కళాశాల ఆవరణలో ఏర్పాట్లు సరి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు బ్లాక్‌ల వారీగా కళాశాల ఆవరణ చుట్టూ సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని



అర్బన్ మండల తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రక్రియ పూర్తయ్యే వరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ఓలు గరిమా అగ్రవాల్, రమేష్ బాబు, బన్సీలాల్, సిద్దిపేట ఏసిపి సురేందర్‌రెడ్డి, ఇందూర్ కళాశాల ప్రిన్సిపల్ వి.పి. రాజు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

గజ్వేల్, అక్టోబర్ 13, మనం న్యూస్ః సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలంగాణ రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ మేరకు సెప్టెంబర్ 17న కోల అభిరామ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనర ల్ బాడీ మీటింగ్ , నూతన కార్యవర్గ ఎన్నిక అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా చిన్ననేతి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా కుంటనోళ్ల శివకుమార్, చైర్మన్‌గా వంటేరు ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా జుబైర్ పాషా, మహిళా కమీషన చైర్మన్‌గా దండుగుల రాజ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, కోశాధికారిగా కుంట సత్యం, ఉపాధ్యక్షులుగా గద్దల రమేష్, వంకాయల ప్రేమ్ నారాయణ, సంపంగి రాజు, రంగనాథ్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీకాంత్, చిల్లి మహే, అంగడి నరేంద్ర బాబు, కర్ణాకర్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా స్వామి, బాలకిషన్, సాయి, యాదగిరి, నాగరాజు , శ్రీనివాస్, డి. బాబు, జి. బాబు, రిఫరీ బోర్డు కార్యవర్గ సభ్యులుగా రాజశేఖర్‌రెడ్డి, కిషన్, సంపత్, కరుణాకర్, రాజు, ప్రభాకర్, శ్రీనివాస్, మహిళా కమీషన్ కన్వీనర్‌గా డి. రజిని, కో కన్వీనర్‌గా దివ్య, శిరీష, రాణి, సభ్యులుగా కవి, స్రవంతి, రమ్యలు నియామకమయ్యారు.

# భారతీయ జనతా పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

## ధర్మారంలో బిఆర్ఎస్ నుండి బిజేపిలోకి చేరికలు

## ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మిరుదొడ్డి, అక్టోబర్ 13, మనం న్యూస్‌: బీజేపి పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన వివిధ కుల సంఘాల అధ్యక్షులు, వార్డు సభ్యులు బిఆర్ఎస్ పార్టీని వీడి బిజేపి పార్టీలో చేరడంతో ఎమ్మెల్యే రఘునందన్‌రావు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ చేస్తున్న అరాచక పాలన గురించి యువకులు ప్రజలకు తెలియజేస్తూ బీజేపి పార్టీకి ఓటేసే విధంగా చూడాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో నడుస్తున్న అరాచక పాలనతో ప్రజలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిని వేధింపులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దేవరాజు, చేరిన వారిలో బిఆర్ఎస్ నాయకులు పిట్ల రవి, యాదగిరి, గోపాల్, రవి, మహిపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, నారాయణ, శంకర్, బిక్షపతితోపాటు తదితరులు ఉన్నారు.



# ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

## మిరుదొడ్డి ఎస్ఐ నరేష్



మిరుదొడ్డి, అక్టోబర్ 13, మనం న్యూస్‌: నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని మిరుదొడ్డి ఎస్ఐ నరేష్ సూచించారు. గురువారం రాత్రి మిరుదొడ్డి మండల పరిధిలోని చెప్యాల గ్రామంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపరిచే కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మూఢనమ్మకాలు, మద్యం తాగడం వల్ల కలిగే నష్టాలు, కుటుంబ కలహాల గురించి, వరకట్న వేధింపులు, ఆత్మహత్యలు, షీ టీమ్స్, డ్రైవింగ్ లైసెన్స్‌పై పాటల ద్వారా ప్రజలకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదన్నారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి యాదగిరి, ప్రజాప్రతినిధులు, పోలీస్ కళాబృందం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# యువతకు మొండిచేయిచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం

## బీజేపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి

చిన్నకోడూరు, అక్టోబర్ 13, మనం న్యూస్‌: నోటిఫికేషన్‌లు, ఉద్యోగ కల్పన విషయంలో బిఆర్ఎస్ ప్రభుత్వం యువతకు మొండిచేయిచ్చిందని భాజపా జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధి సలేంద్రి గ్రామంలో 50 మంది యువత బిఆర్ఎస్ నుండి బిజేపిలో చేరారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితిలో లేరని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణ గడ్డపై బీజేపి జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అవినీతికి, అబద్దాలకు కేరాఫ్ అడ్రస్‌గా బిఆర్ఎస్ మారిందని, భాజపా నుండి బిఆర్ఎస్‌లోకి వలసలు కాదు, బిఆర్ఎస్ నుండే బీజేపిలోకే వలసల ప్రవాహం సాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి జరుగుతుందని భావించిన యువత కాషాయ కండువా కప్పుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి లక్షల కోట్ల రూపాయలను మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకుంటుందన్నారు. యువతకు బీజేపి పార్టీ అండగా ఉంటుందని, మరింతమంది బిఆర్ఎస్ నుండి బీజేపిలోకి రాబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పర్శరాములు, నాయకులు నవీన్‌రెడ్డి, వేణు, శ్రీకాంత్, రాజు తదితరులు ఉన్నారు.



# ఎన్నికల కోడ్ పేరుతో దళితబంధు నిలిపివేయడం సరికాదు

## డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



మిరుదొడ్డి, అక్టోబర్ 13, మనం న్యూస్‌: ఎన్నికల కోడ్ పేరుతో దళితబంధు పథకాన్ని నిలిపివేయడం సరికాదని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. శుక్రవారం మిరుదొడ్డిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, మానకొండూరు, జనగామ నియోజకవర్గాల్లో దళితబంధు యథావిధిగా అమలవుతుంటే దుబ్బాక నియోజకవర్గంలో మాత్రం ప్రజాప్రతినిధులు అడ్డుకోవడం సరికాదన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో దళితబంధు పథకం అమలుకాకపోతే ఉద్యమం తప్పదన్నారు. దళితులకు దళితబంధు పథకం యథావిధిగా అమలయ్యేలా స్థానిక ఎంపి, ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కేరింగ్ సిటిజన్ కలెక్టివ్ జిల్లా కో ఆర్డినేటర్ ప్రవీణ్, డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, బాల్‌నర్సు, రాజుతోపాటు తదితరులు ఉన్నారు.

## భోజనం నుంచి లేపి ఆంక్షలు విధించిన పెద్దలు



చేర్యాల, అక్టోబర్ 13, మనం న్యూస్‌: పెద్దమనుషులుగా కొందరు చలామణి అవుతూ శుభకార్యానికి పిలిచి భోజనం పెట్టి ఆ భోజనం నుంచి లేపి ఆంక్షలు విధించిన సంఘటన చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఆకునూరు గ్రామానికి చెందిన కంతుల నరసింహులు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది పెద్ద మనుషులుగా చలామణి అవుతూ తన కు తన కుటుంబానికి ఆంక్షలు విధిస్తూ మానసికంగా ఇబ్బంది పెడు తున్నారని స్థానిక చేర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కులవృత్తిల కంకణం కోసం వెళ్తే కుల బహిష్కరణ చేస్తున్నారని, తన వ్యవసాయ పనులకు ఎవరు కూడా వెళ్లవద్దని , శుభకార్యంలో భోజనం పెట్టి తిరిగి వెళ్లగొడుతున్నారన్నారు. అంతేకాకుండా తన ఇంట్లో ఏ శుభకార్యం చేపట్టినా ఎవరు వెళ్లవద్దని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు



దౌల్తాబాద్, అక్టోబర్ 13, మనం న్యూస్‌: దౌల్తాబాద్ మండల పరిధిలోని కోనాపూర్ చౌరస్తా వద్ద దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మొండి చింత వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిండగా దౌల్తాబాద్ వైపు వస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేశారు. ఇందుకుగాను శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు పూర్తిగా సహకరించారు. తనిఖీల్లో కారులో పార్టీకి సంబంధించిన కండువాలు మాత్రమే ఉండడంతో శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా అక్కడి నుండి పంపించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సాయిలు తోపాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## టిఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ విద్యా కమిటీ ఛైర్మన్‌గా అశోక్ కుమార్



దుబ్బాక, అక్టోబర్ 13, మనం న్యూస్ః దుబ్బాక పట్టణ కేంద్రంలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సొసైటీ విద్యా కమిటీ ఛైర్మన్‌గా ఎస్. అశోక్ కుమార్ నియమితులయ్యారు. స్కూల్‌లో దాదాపు 400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. దసరా సెలవుల సందర్భంగా శుక్రవారం చివరి పనిదినం కావడంతో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సెలవుల్లో పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని, ప్రతి రోజు గంట పాటు చదువుకు కేటాయించే విధంగా చూసుకోవాలన్నారు. తెలంగాణ పూల పండుగ బతుకమ్మ సంబరాలు ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ గీత జనరల్ సెక్రటరీ పర్శరాములు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# మన ఆరోగ్యం మన చేతుల్లోనే

### కలెక్టరేట్‌లో సెల్ఫ్ ఆటోమేటెడ్ బిపి చెకప్ మిషన్ ఏర్పాటు

### బిపి పరీక్షించుకున్న కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్

సిద్దిపేట, అక్టోబర్ 13, మనం న్యూస్ ప్రతినిధిః మన ఆరోగ్యం మన చేతుల్లోనే దాగి ఉందని, నిత్యం మనం తీసుకునే ఆహారపు అలవాట్లు, జీవన విధానాల ద్వారా ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోగలమని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆటోమేటిక్





బిపి చెకప్ మిషన్‌ను డిఎంహెచ్ఓ డా. కాశీనాథ్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించి స్వ యంగా బిపి పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతోనే కలెక్టరేట్‌లో సెల్ఫ్ ఆటోమేటిక్ బిపి చెకప్ మిషన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చాలా మంతి బిపితో బాధపడుతున్నట్లు తెలియక అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృత్యువాత పడుతున్నారన్నారు. వీలైనప్పుడల్లా బిపి పరీక్ష చేసుకోవడం ద్వారా బిపి ఉన్నట్లయితే వెంటనే వైద్యుడి సాయంతో మందులు వాడి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు.

## ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించాలి



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 13, మనం న్యూస్ః తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదోన్నతులు పొందిన 25 మంది ఉపాధ్యాయులకు శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు సి.హెచ్. విజయేందర్‌రెడ్డి, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి సయ్యద్ షౌకత్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమోషన్‌లు పొందిన ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనల మేరకు పని చేయాలని, బాధ్యతతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం నిరంతరం పాటుపడాలని, విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుదాస్, నర్సింహారెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు జి. తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కనకయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొనమల్ల రాములు, రాష్ట్ర కౌన్సిలర్లు జమీర్ మొహినొద్దీన్, విష్ణువర్ధన్, జానకిరాములు, పద్మయ్య, రాజులు, జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, రాంరెడ్డి, నర్సింహారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నర్మెట విద్యార్థుల ఎంపిక

నంగునూరు, అక్టోబర్ 13, మనం న్యూస్ః స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంఓ గురువారం మెదక్ జిల్లా గోమారంలో నిర్వహించిన జోనల్ స్థాయి (సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి) వాలీబాల్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్మెట విద్యార్థులు అండర్ 17 బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిలో 9వ తరగతి చదువుతున్న చేర్యాల వైష్ణవి, పదవ తరగతి విద్యార్థిని బందారం వర్షలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరు ఈనెల 19 నుండి 21 వరకు మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో జరగనున్న అండర్14 బాలికల విభాగంలో కూడా ద్వితీయ స్థానంలో నిలవడానికి 9వ తరగతి విద్యార్థిని పిల్లి శిరీష, బొజ్జపైని గుండెల్లి వైష్వి, ఏడవ తరగతి విద్యార్థిని పిల్లి శివానిలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరంతా త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ దేశిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు క్యాతం రాజ్‌కుమార్ తెలియజేశారు. ఇందుకు వారికి చక్కటి శిక్షణ ఇచ్చిన పిఈటి క్యాతం రాజ్‌కుమార్‌ను, విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంచార్జ్ ఎంఈఓ దేశిరెడ్డి, ఉపాధ్యాయ బృందం, మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ అజీజ్, ఎంపిటిసి బాబు, గ్రామస్తులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

## చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

### అట్టహాసంగా ప్రారంభమైన గురుకుల జోనల్ లెవల్ మీటింగ్ ఉత్సవాలు




మిరుదొడ్డి, అక్టోబర్ 13, మనం న్యూస్ః విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సెక్రటరీ నవీన్ నికోలస్ అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల చెప్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో జోనల్ మీటింగ్ ఉత్సవాలను జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు చెందిన 12 గురుకుల పాఠశాలల నుండి 1020 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉజ్వల భవితకు కార్పోరేట్ తరహాలో గురుకుల పాఠశాలలో విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంతతోపాటు శారీరక ధృఢత్వం కలుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిఓ నిర్మల, ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్‌లు ధనలక్ష్మి, సుజాతతోపాటు తదితరులు ఉన్నారు.



## రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ పోటీలకు ధర్మాజీపేట విద్యార్థులు ఎంపిక



దుబ్బాక, అక్టోబర్ 13, మనం న్యూస్ః రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ పోటీలకు ధర్మాజీపేట పాఠశాల విద్యార్థినిలు ఎంపికయ్యారు. అండర్ 17 వాలీబాల్ బాలికల విభాగంలో ధర్మాజీపేట ఉన్నత పాఠశాల విద్యార్థినిలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పిఈటి నరేష్ తెలిపారు. గురువారం శివ్వంపేట మండలం గోమారం ఉన్నత పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి (సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి) పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న అక్షయ, నందిని, హర్షిని విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 18వ తేదీ నుండి మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, ఎస్‌ఎంసి ఛైర్మన్, ధర్మాజీపేట కౌన్సిలర్లు విద్యార్థినిలను అభినందించారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ ఆర్థిక సాయం



గజ్వేల్, అక్టోబర్ 13, మనం న్యూస్ః మండల పరిధిలోని పలుగు గడ్డ గ్రామానికి చెందిన లోకుల కిష్టయ్య అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. అయితే శుక్రవారం వారి కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ శ్రీపతి రాజేశ్వరి రవి పరామర్శించి 50 కిఓలల బియ్యాన్ని గ్రామశాఖ అధ్యక్షులు పిట్టల అంజయ్య ఆధ్వర్యంలో రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కనకయ్య, కో ఆప్షన్ సభ్యులు నర్రా కనకయ్య, గువ్వ రమేష్, కొలకడు లింగాల రామచంద్రం, నర్సింలు, ఐలయ్య, కనకయ్య, నర్సింలు, రమేష్, జి. కనకయ్య, కృష్ణ, సిహెచ్. నర్సింలుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## టిఎస్‌పిఎస్‌సిని ప్రక్షాళన చేయాలి

**నేటి అఖిలపక్ష రాస్తారోకోను జయప్రదం చేయాలి**

**తెలంగాణ జన సమతి జిల్లా కన్వీనర్ నీరుడి స్వామి**



గజ్వేల్, అక్టోబర్ 13, మనం న్యూస్ః టిఎస్‌పిఎస్‌సి వైఫల్యం, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం లోని ఎంతో మంది విద్యార్థి యువజన వర్గాలు తీవ్ర నిరాశకు గురయ్యాయని తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ నీరుడి స్వామి అన్నారు. ఈ నేపథ్యంలో టిఎస్‌పిఎస్‌సి వైఫల్యాలను ఎండగడుతూ నేడు అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టనున్న రహదారులపై రాస్తారోకో కార్యక్రమాన్ని అన్ని పార్టీల రాజకీయ నాయకులు, విద్యార్థి యువజన సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నేడు ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగే ఈ రాస్తారోకోలో ప్రజలు, విద్యార్థులు, యువత మద్దతుగా పాల్గొనాలన్నారు. ప్రస్తుత టిఎస్‌పిఎస్‌సి బోర్డు సభ్యులను తొలగించి నూతన సభ్యులను నియమించాలని, టిఎస్‌పిఎస్‌సిని పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డిఎస్సీ పరీక్షలో పోస్టులు 13500లకు పెంచాలన్నారు.

## ఉప సర్పంచ్‌ను పరామర్శించిన డిబిఎఫ్ నేత శంకర్



దౌల్తాబాద్, అక్టోబర్ 13, మనం న్యూస్ః దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామ ఉప సర్పంచ్ బొల్లం స్వామిని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ పరామర్శించారు. ఇటీవల బొల్లం స్వామి తండ్రి మరణించిన విషయం తెలుసుకొని శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. వారి వెంట డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, రాజేష్ తదితరులు ఉన్నారు.

# అభివృద్ధిని చూసి బీజేపిలోకి చేరికలు

**బీజేపిలో చేరిన కోనాపూర్ సర్పంచ్ స్వామి**

**పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు**

దౌల్తాబాద్, అక్టోబర్ 13, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే అది కేవలం బీజేపితోనే సాధ్యమవుతుందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ పంచమి స్వామి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో శుక్రవారం బీజేపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్ల నుండి చేయని అభివృద్ధి ఇప్పుడు చేస్తామనడం సరికాదన్నారు. రెండున్నర సంవత్సరాల కాలంలో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచామని, గత కొన్నేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాడు చేయని అభివృద్ధి ఇప్పుడు చేస్తామనడం సిగ్గుచేటన్నారు. దుబ్బాకలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి జరిగే ఎన్నిలక్లో అఖండ మెజార్టీతో బీజేపిని గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా కోనాపూర్ వార్డు మెంబర్ భవాని ప్రభాకర్, రాజవ్వ బాలస్వామి, రాజు, మధులు పార్టీలో చేరగా వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి బీజేపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామాధ్యక్షులు రమేష్ గౌడ్, అనిల్‌రెడ్డి, సత్యనారాయణ గౌడ్‌తోపాటు తదితరులున్నారు.





## ఇంటింటా సంక్షేమం బిఆర్ఎస్‌తోనే సాధ్యం

**గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టం**

**ఎమ్మెల్సీ యాదవరెడ్డి**

**ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి**

గజ్వేల్, అక్టోబర్ 13, మనం న్యూస్ః గజ్వేల్ నియోజకవర్గం తోపాటు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించాలంటే అది కేవలం బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్‌లు అన్నారు. గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామంలో గజ్వేల్ రూరల్ మండల బూత్ స్థాయి సమావేశాన్ని మండల అధ్యక్షులు బెండె మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రి హరీష్‌రావు ఆదేశానుసారం బిఆర్ఎస్ మండల బూత్ కమిటీల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. వ్యవసాయం దండగ అన్న పరిస్థితి నుండి వ్యవసాయం పండుగ అనే స్థాయికి తీసుకువచ్చి రైతులను అభివృద్ధిలోకి తీసుకువచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. మల్లన్న సాగర్ జలాశయం ద్వారా భూగర్భ నీటి మట్టం పెరిగి గజ్వేల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయం పండుగలా సాగుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేశారని గోదావరి నీటిని ప్రతి ఎకరాకు పంపిణీ చేస్తూ బీడు భూములను పచ్చని మాగానాలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్‌ను గజ్వేల్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా గెలిపిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి మల్లేశం, ఆత్మ కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ వెంకట్ గౌడ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షులు మద్ది రాజిరెడ్డి, వైస్ఎంపిపి కృష్ణా గౌడ్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు చంద్రమోహన్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ నాయకులు రవిందర్ రావుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## యువత అన్ని రంగాల్లో రాణించాలి

**ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్, అక్టోబర్ 13, మనం న్యూస్ః యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లో శుక్రవారం ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా యువ దర్శకుడు పేర్ల భాస్కర్ పర్యవేక్షణలో నిర్మించిన పేర్ల మ్యూజిక్ ఛానల్ వారి నీ ప్రేమ యాదిలో పార్ట్ 2 సాంగ్ క్యాసెట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ యువత చదువుతోపాటు ఇతర రంగాల్లో రాణించి తమ సొంత కాళ్లపై నిలబడాలని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా మంచి గమ్యాన్ని ఏర్పరచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యువ దర్శకుడు పేర్ల భాస్కర్ మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. పేర్ల మ్యూజిక్ ఛానల్ ద్వారా యువతకు మంచి అవకాశాలు కల్పించాలని, మరిన్ని మంచి పాటలు తీసుకువచ్చి శ్రోతలను అలరించాలని అభినందించారు.

## బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కషి చేయాలి

**ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలి**

**బిఆర్ఎస్ మండల పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎంపిటిసి కవిత శ్రీనివాస్‌రెడ్డి**



జగదేవ్‌పూర్, అక్టోబర్ 13, మనం న్యూస్ః వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బిఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురా లు, ఎంపిటిసి కవితా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ప్రచార శైలి దగ్గరలో ఉన్నందున గ్రామాల్లోని ప్రతి ఇంటికి ప్రతి గడపకు వెళ్లి గత పదేళ్లలో బిఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామంలోని బిఆర్ఎస్ కార్యకర్తలను, నాయకులను కలుపుకొని ప్రతి ఒక్కరికి వివరిం చాల న్నారు. బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నారు. అభివృద్ధి వైపే జగదేవ్‌పూర్ ప్రజలు ఉంటారని, మరోసారి లక్ష మెజార్టీతో బిఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయ మని, సీఎం కేసీఆర్ మరోసారి సీఎం కావడం ఎవరూ అడ్డుకోలేరన్నారు.

# ప్రకృతి పూల పండుగ



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 13, మనం న్యూస్ః ప్రకృతిలోని పూవులను పూజించే అతిపెద్ద పండుగ బతుకమ్మ పండుగ. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ పండుగ. తొమ్మిది రోజుల పాటు తెలంగాణ ఆడపడుచులంతా సంబురంగా జరుపుకునే పండుగ బతుకమ్మ. నేటి నుండి తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా బతుకమ్మ పాటలతో సాంప్రదాయబద్ధంగా ఆడపడుచులు ఆడుతూ, పాడుతూ ఘనంగా నిర్వహించుకుంటారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. దేశ విదేశాలలో బతుకమ్మ ప్రాచుర్యం, ఔన్నత్యాన్ని తెలిసేలా తెలుగు వారంతా బతుకమ్మ ఆడిపాడి సంతోషంగా ప్రతి సంవత్సరం గడుపుతారు. ఈ కాలంలో లభించే తంగేడు, గునుగు పూలను సేకరించి రంగులలో అద్ది బతుకమ్మను అందంగా తీర్చిదిద్ది, బతుకమ్మ ఎంత ఎత్తు ఎదిగితే వారి సంసారం అంత ఎత్తుకు ఎదిగిందని భావించి ప్రతి సంవత్సరం ఒకరికొకరు పోటీపడి బతుకమ్మను ఎత్తుకు పేరుస్తారు. ప్రతి పాటలో కష్టసుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు అన్నీ ఉండేలా బాణీలు కలుపుతూ పాటలు పాడుతారు. గ్రామాలలో కూడళ్ల వద్ద మహిళలంతా ఒక దగ్గరికి చేరి సాయంకాలం బతుకమ్మ ఆడుతూ పాడుతూ సంతోషంగా గడుపుతారు. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ, రెండవ రోజు అటుకుల బతుకమ్మ, మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగవ రోజు నానెబియ్యం బతుకమ్మ, ఐదవ రోజు అట్ల బతుకమ్మ, ఆరవ రోజు అలిగిన బతుకమ్మ, ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మగా జరుపుకుంటారు. ప్రతి రోజు బతుకమ్మకు నైవేద్యంగా వివిధ వంటకాలతో సమర్పించి చెరువులో, కుంటల్లో బతుకమ్మ నిమజ్జనం చేస్తారు. ప్రతి బతుకమ్మ పాటలో గ్రామీణ ప్రాంత వైవిద్యం, ప్రజల ఆచారాలు, ప్రకృతిలో లభించే పూవుల విశేషాలు తెలుపుతూ పాటలలో అల్లుతూ బతుకమ్మను ఆడుతారు.

### -బతుకమ్మ శుభాకాంక్షలు

తెలంగాణ ఆడపడుచులకు మంత్రి హరీష్‌రావు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తీరొక్క రంగులతో తొమ్మిది రోజుల పాటు ఆడపడుచులు జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా మంత్రి శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. దేవంలోనే పూవులను పూజించి, ప్రకృతి ప్రేమించే గొప్ప పండుగ అన్నారు.

## టిడిపి మండల అధ్యక్ష పదవికి షాహెద్ పాషా రాజీనామా

పాపన్నపేట, అక్టోబర్ 13, మనం న్యూస్ః పాపన్నపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు అధ్యక్షులు ఎండి. షాహెద్ పాషా ప్రకటించారు. శుక్రవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను 1985 నుండి టిడిపిలో క్రియాశీలక రాజకీయాల్లో ఉండి రామతీర్థం ఉప సర్పంచ్‌గా, సర్పంచ్‌గా, మెదక్ ఏఎంసి డైరెక్టర్‌గా, టిడిపి ప్రధాన కార్యదర్శిగా ఎన్నో పదవులను నిర్వహించినట్లు తెలిపారు. 2009లో మెదక్ ఎమ్మెల్యేగా మైనంపల్లి హనుమంతరావు ఉన్న సమయంలో ఆయనతో అనుబంధం , ఆప్యాయత, ప్రేమానురాగాలు, స్వచ్ఛంద సేవ తదితర కార్యక్రమాలు మరువలేనివన్నారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే హనుమంతరావు కుమారుడు రోహిత్‌రావుకు మెదక్ కాంగ్రెస్ టికెట్ ఇవ్వడం సంతోషకరమన్నారు. హనుమంతరావుపై ఉన్న అనుబంధంతోనే ఆయన కుమారుడు రోహిత్‌రావు గెలుపుకు కృషి చేస్తానని, త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు షాహెద్ పాషా తెలిపారు. ఆయన వెంట కురుమ కుమార్, నల్లోల్ల సత్తయ్య తదితరులున్నారు.




# కేసీఆర్ సర్కార్‌కు కాలం చెల్లింది

**- బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించడమే లక్ష్యం**

**- గౌరవెల్లిని ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి**

**- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**

హుస్నాబాద్,అక్టోబర్ 13,(మనం న్యూస్)ః కేసీఆర్ సర్కార్‌కు కాలం చెల్లిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని కడతా అన్న సీఎం కేసీఆర్ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో హుస్నాబాద్ ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. 2007 లో రూ.1300 కోట్లతో గౌరవెల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఘనత సిపిఐ పార్టీదే అన్నారు. హుస్నాబాద్ ప్రజలను సెంటిమెంట్‌గా వాడుకోవడమే తప్ప అభివృద్ధి మాత్రం చేయడంలేదంటూ ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌ను ఈ సారి ప్రజలు గద్దె దించేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో మతాన్ని పెంచి పోషిస్తూ ప్రజలను మోసగిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఎన్ని ఆశీర్వాద సభలతో ముందుకు వచ్చిన ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన ఆరోపించారు. సిద్దిపేట జిల్లాలోనే వైద్యారోగ్య శాఖ మంత్రి ఉన్నప్పటికీ హుస్నాబాద్‌లో 100 పడకల ఆసుపత్రిని కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బిజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించడమే సిపిఐ పార్టీ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపే మల్లేశ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యెడల వనేష్, జాగిరి సత్యనారాయణ, నియోజకవర్గ నాయకులు కొయడ సృజన్‌కుమార్, అక్కనపేట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, మంద శ్రీనివాస్, బొజ్జ పూరి రాజు, ఎఐవైఎస్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజుకుమార్, సిపిఐ మండల నాయకులు మెడవేని సారయ్య, పుదరి రఘుపతి, ఇంద్రాల మల్లయ్య, పిట్టల ప్రసాద్, పొదిల కనకస్వామి, జంగ విజయ, తదితరులున్నారు.




## స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలి

**-జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్**




గజ్వేల్, అక్టోబర్ 13, మనం న్యూస్ః గజ్వేల్ నియోజకవర్గ ఈవియం మిషన్‌ల స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం రోజున గజ్వేల్ ఐఓసి కార్యాలయంలోని ఏ బ్లాక్‌లో ఎన్నికల ఈవియం స్ట్రాంగ్‌రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కిటికీలను పూర్తిగా ఇటుకలతో మూసివేయాలని, స్ట్రాంగ్ రూమ్ చుట్టూ సిసి కెమెరాలు అమర్చాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ పక్కన విద్యుత్ మాపక గది ఉన్నందున ఫైరింగ్ సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించడానికి ఫైర్ వాహనం అందుబాటులో ఉంచాలని జిల్లా అసిస్టెంట్ ఫైరింగ్ ఆఫీసర్ సురేష్‌కు తెలిపారు. తపాలా కార్యాలయంలో నియోజకవర్గ నూతన ఓటర్లకు సంబంధించిన ఓటర్ ఐడి కార్డులు వచ్చాయని, తపాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన వాటిని వెంటనే గ్రామాల్లో సంబంధీకులకు అందించాలన్నారు. ఎలక్షన్ మెటీరియల్ రూమ్, ఈవియం మిషన్ హాల్, ఈఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పెండీచర్ మానిటరింగ్ సెల్‌లో అకౌంటింగ్ టీమ్, అసిస్టెంట్ ఎక్స్‌పెండీచ్ అబ్జర్వర్, వీడియో వ్యూయింగ్ టీమ్‌లను పరిశీలించారు. అనంతరం ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించి ప్రహారీగోడ లేనందున బారికేడ్ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బన్సీలాల్, ఏసిపి రమేష్ తదితరులు ఉన్నారు.

## కంఠంలో ఊపిరి ఉన్నంత వరకు అమ్మవారి మాల ధరిస్తా: పట్నం మాణిక్యం



సంగారెడ్డి, అక్టోబర్ 13, మనం న్యూస్ః కంఠంలో ఊపిరి ఉన్నంతవరకు అమ్మవారి మాల ధరిస్తానని ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి ఛైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలంలోని పది తండాలలో భవాని మాత దీక్షదారుల ఆధ్వర్యంలో భోగ్‌బండర్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భోగ్ బండర్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. కొండాపూర్ మండలంలోని గిరిజన సోదరులు పట్నం మాణిక్యంకు అడుగడుగునా నీరాజనం పలికారు. ఈ కార్యక్రమంలో హనుమంత్ నాయక్, ఎంపిటిసి, ప్రకాష్ నాయక్, బ్యాతోల్ మాజీ ఉప సర్పంచ్ విఠల్ నాయక్, గోపాల్ నాయక్, మల్లేష్ యాదవ్, కొండాపూర్ మండల గిరిజన సోదరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు సిద్దిపేట విద్యార్థులు



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 13, మనం న్యూస్ః తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు సిద్దిపేట శ్రీసాయి స్కేటింగ్ అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ సంపత్‌కుమార్ తెలిపారు. ఈనెల 14 నుండి 17వ తేదీ వరకు నల్గొండ జిల్లా భువనగిరిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులను సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరామ్, నాగేందర్, సిద్దిపేట రోలర్ స్కేటింగ్ అధ్యక్షులు పిండి అరవింద్, ఉపాధ్యక్షులు పల్లె చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ పోకల సంతోష్‌లు అభినందించారు.

# ఓటు అడిగే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదు

**-తొమ్మిది వేల కోట్లతో పటాన్‌చెరు సమగ్రాభివృద్ధి**

**-గడప గడపకు ప్రగతిని వివరించండి**

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

పటాన్‌చెరు, అక్టోబర్ 13, మనం న్యూస్ః ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లలో చేపట్టిన ప్రగతిని గడపగడపకు వివరించి వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలు, బూత్ కమిటీ , విద్యార్థి యువత సోషల్ మీడియా





విభాగం ప్రతినిధులు సమావేశానికి ఎమ్మెల్యే, శాసన మండలి మాజీ ఛైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకువెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ పార్టీ విజయం ఎంతో కీలకమన్నారు. గత పదేళ్ల కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని, ప్రగతిని ప్రతి ఇంటా వివరించాలన్నారు. దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న సంకుచిత బుద్ధితో కాంగ్రెస్ పార్టీ డబ్బులు క ట్టలు పంచేందుకు సిద్ధం చేస్తుందని ఆరోపించారు. అవినీతి కాంగ్రెస్ పార్టీ మతతత్వ బీజేపి పార్టీలకు తెలంగాణలో స్థానం లేదన్నారు. ఎన్నికల సమయంలో గొడవలు, అలజడులు సృష్టించేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు రెచ్చిపోకుండా సంయమనంతో ఉండాలన్నారు. పార్టీకి కార్యకర్తలే వెన్నుముకని, ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేసినపుడే విజయం సాధ్యమవుతుందన్నారు. అనంతరం జిన్నారం మండలం వావిలాల గ్రామ సర్పంచ్ నవనీత్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. గుమ్మడిదల మండలం అనుకుంట గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం సభ్యులు తమ సంపూర్ణ మద్దతును ఎమ్మెల్యే జిఎంఆర్‌కు తెలిపారు.

## సంగారెడ్డి జిల్లా ఎస్పీగా చెన్నూరి రూపేష్



సంగారెడ్డి, అక్టోబర్ 13, మనం న్యూస్ః సంగారెడ్డి జిల్లా ఎస్పీగా చెన్నూరి రూపేష్ నియమితులయ్యారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. 2016 యుపిఎస్సీ పరీక్షలో 526 ర్యాంకు సాధించారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్ అధికారిగా నిలిచారు. ఇది వరకు సంగారెడ్డిలో ఎస్పీగా పనిచేసిన ఎం. రమణకుమార్‌ను కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ముందుగా సంగారెడ్డి జిల్లా ఎస్పీగా శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.



# గోరంత అభివృద్ధి... కొండంత ప్రచారం

**కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్**

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 13, మనం న్యూస్ః సిద్దిపేట నియోజకవర్గంలో చేసింది గోరంత.. ప్రచారం కొండంత అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు లబ్ధి పొందేలా సిద్దిపేటలో పనులు చేయిస్తున్నారని, జిల్లా కేంద్రం నూతనంగా కావడంతో సిద్దిపేటలో మాత్రమే అభివృద్ధి జరుగుతుందని, గ్రామాల్లో అభివృద్ధి పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లయినప్పటికీ గ్రామాల్లో రోడ్ల మరమ్మత్తులు, రోడ్లు, డ్రైనేజీలు ఎందుకు నిర్మించలేదో మంత్రి సమాధానం చెప్పాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కోసం సర్పంచ్‌లు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు రాక అప్పులపాలవుతున్నారన్నారు. బిసిబంధు, దళితబంధు గ్రామాలలో కేవలం ఐదారుగురికి ఇచ్చి అందరికీ ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. లబ్ధిదారులు మంత్రి అనుచరులు మాత్రమే అని, సామాన్య ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడుతూ ప్రశ్నించకుండా చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నకోడూరు మండల అధ్యక్షులు మీసం మహేందర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉడుత జయంత్,



నారాయణరావుపేట మండల బిసి సెల్ మాజీ అధ్యక్షులు కనకయ్య, మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా గోడలపై రాతలు

**గోడలపై మురంశెట్టి రాములు రాతలు అప్రజాస్వామికం**

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్**

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 13, మనం న్యూస్ః ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడిగా బాధ్యత అని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టిటిడి మాజీ బోర్డు సభ్యులు మురంశెట్టి రాములు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా గోడలపై రాతలు రాయిస్తున్నారని మండిపడ్డారు. అతను రాసే రాతలు ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్నాయన్నారు. గోడలపై రాసిన రాతలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. అతనిపై వెంటనే అధికారులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్నికల కమీషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదరి మధు, గయజుద్దీన్, రషీద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆదేశాల మేరకు పోటీ చేస్తున్నా

## -ప్రజా ఆత్మగౌరవమే ప్రధాన ఎజెండాగా కొట్లాడుతా

## -నీలం మధు ముదిరాజ్




పటాన్‌చెరు, అక్టోబర్ 13, మనం న్యూస్: పటాన్‌చెరు మండలం తన స్వగ్రామమైన చిట్కుల్‌లో పలు కాలనీలలో గ్రామ ప్రజలతో నీలం మధు ముదిరాజ్ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మధు ముదిరాజ్ మాట్లాడుతూ తనకు రాజకీయ ఓనమాలు నేర్పి రాజకీయంగా ఈ స్థాయికి తీసుకువచ్చిన కుటుంబ సభ్యుల లాంటి మీ అందరి ప్రేమ ఆప్యాయతలు, సహకారం మర్చిపోలేనన్నారు. మీ ఇంట్లో బిడ్డగా తనకు గ్రామంలోని సమస్యలన్నీ



తెలుసునని, తాను సర్పంచ్‌గా చాలా సమస్యలను పరిష్కరించానన్నారు. ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే చిట్కుల్ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పటాన్‌చెరు ప్రజల అభీష్టం మేరకు ఈసారి ఎన్నికల బరిలో నిలబడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈనెల 16 నుండి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టనున్న పాదయాత్రకు మీ ఆశీస్సులు, చల్లని దీవెనలు కావాలని కోరారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బహుజనులను అన్ని పార్టీలు విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం దొరికినపుడే మనందరికి సమన్యాయం జరుగుతుందన్నారు. ప్రజలే దేవుళ్లుగా ప్రజలమాటే వేదంగా తీసుకొని అందరి అభిప్రాయాలను సేకరించి పోరాటాన్ని ప్రారంభిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ ధర్మ పోరాటాన్ని చూసి పార్టీలు తప్పక గుర్తిస్తాయన్న నమ్మకం తనకుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటేష్, రాజ్‌కుమార్, మురళి, మంజలి శ్రీనివాస్, శాంత్‌కుమార్, పిట్ల లక్ష్మణ్, మంజలి యాదయ్య, వెంకటేష్, బరంబస్, సుబ్బారావు, తాతారావు, హనుమంతుతోపాటు తదితరులున్నారు.



# బిఆర్ఎస్‌లో చేరిన మామిళ్ళ

## పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి హరీష్‌రావు



మెదక్, అక్టోబర్ 13, మనం న్యూస్: పిసిసి అధికార ప్రతినిధి, మెదక్ పట్టణ 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, బిఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి సమక్షంలో వారి అనుచరులతో కలిసి శుక్రవారం మామిళ్ల వారి గృహంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మామిళ్ళ ఆంజనేయుఉను పార్టీలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, వైస్ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్, ఏఎంసి చైర్మన్ బట్టి జగపతి, జెడ్పి వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ అంజా గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# శాంతినికేతన్ విద్యాలయంలో బతుకమ్మ సంబరాలు



సదాశివపేట, అక్టోబర్ 13, మనం న్యూస్: సదాశివపేట పట్టణంలో శాంతినికేతన్ విద్యాలయంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ జయమ్మ ముఖ్య అతిథిగా హాజరై గౌరమ్మ పూజ చేసి బతుకమ్మ సంబరాలు ప్రారంభించారు. బతుకమ్మ ప్రత్యేక గురించి, పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. ప్రకృతిలోని పూవులను పూజించే అత్యంత అరుదైన, గొప్పనైన పండుగ బతుకమ్మ అని తెలియజేశారు. ప్రతి మహిళ పసుపు, కుంకుమతో బతుకమ్మను పూజించి కుటుంబాన్ని చల్లగా చూడాలని ప్రత్యేకంగా వేడుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రథమ బహుమతి వర్షిత, ద్వితీయ బహుమతి బలరాం ప్రణీత, బలరాం స్వాతి, తృతీయ బహుమతి దీక్షిత గౌడ్ మౌనికలు దక్కించుకున్నారు. ఈ కార్యక్రంలో పాఠశాల యాజమాన్యం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాలి పటేల్ ప్రభు, ప్రధానోపాధ్యాయురాలు అరవిందశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## ఈత చెట్లు పెంచుకోవడానికి రెండెకరాల స్థలం కేటాయించాలని వినతి

సంగారెడ్డి, అక్టోబర్ 13, మనం న్యూస్: కంది మండలం ఆరుట్ల గ్రామంలో ఈత చెట్లు పెంచుకోవడానికి ఎల్లమ్మ దేవాలయం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ ఆరుట్ల గీత పారిశ్రామిక సంఘం సభ్యులు ఆధ్వర్యంలో టిఎస్‌హెచ్‌డిసి చైర్మన్ చింతా ప్రభాకర్‌కు పట్టణ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. అనంతరం గీత పారిశ్రామిక సంఘం సభ్యులు మాట్లాడుతూ సానుకూలంగా స్పందించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో మీ వెంట మేముండి గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం చింతా ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, ఆరుట్ల మాజీ సర్పంచ్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.